"ఏడెవరా" అన్నారు రెడ్డిగారు మీసాలు నిమురుకుంటూ.

"మా అన్న కొడుకండీ" దూరంగా ఒదిగి నిలుచున్నాడు మా చిన్నాయన. తన వెనుక నేను.

"రాములుగాని కొడుకా?"

"అవును దొరా."

"ఫర్వాలేదే, పనిలోకి పనికొస్తాడే, రేపటి నుంచి మా గొడ్లకాడికి పంపు. రాములుగాని బాకీ యాభై రూపాయలు తీరేదా చెప్పేదా? వీడిని ఒక ఏడాది పనిలోకి పంపితే చెల్లగట్టుకొంటాను."

"వీడు సదువుకొంటున్నాడు సామీ"

"మీరంతా చదువుకొంటే మేమంతా చెప్పులు కుట్టుకోవలసిందే. ఎవరి వృత్తులు వారు చేసుకొంటేనే మంచిది."

"చిత్తం."

"మరి వీని మాటేమిటి?"

"నేనేం మీ గొడ్లు కాయను నేను సదువుకొంటా" అన్నాను బింకంగా.

"ఒరి వీ... బానెడంత లేవు. పొగరు బాగానే ఉందే."

"తప్పుకాయి దొరా. పసోడు తెలీదు. మా కూలిగింజ లిప్పించండి. ఎంగటేసూ ఇంటికి పో, నీ పని చెప్తా."

ఇంటికి వచ్చాక రెడ్డిగారికి ఎదురు నిలబడి మాట్లాడినందుకు మా అమ్మ, నాయన నన్ను చితకబాదారు. మా ఇంటి వెనుక చింతచెట్టుక్రింద కూర్చుని ఏడ్చాను. మా పల్లె ఊరికి దూరంగా వుండేది. మొత్తం ఇరవై ముప్ఫయి గుడిసెలుంటాయేమో? ఇప్పుడో అప్పుడో కూలబోయే మట్టిగోడలు పెంకుటప్పులు. మురుగు కాలువలు, ఈగలు, దోమలు, చింకిగుడ్డలు, జీబురు తలలు.... ఇదీ అక్కడి వాతావరణం.

నన్ను బడికి పంపుతానని నాన్న చెప్పిన నాడు "అమ్మ ఏడ్పు రాగాలు పెట్టింది. "మనోళ్లు సదువుకోటమేటి? రెడ్డోరింట్లో పని చేస్తే అది తిండి అయినా తింటాము."

"సాల్లేవే. అది బతుకా మనుగడ? నాశనం చేసేదా? అప్పనంగా [illegible] అప్పని. ఆ తర్వాత మాద్దాం."

బళ్ళో నేను పెద్దింటి పిల్లలతో కలిసి మెలిసి ఉండేవాణ్ణి కాని వాళ్ళు [illegible] పడకుండా తప్పించుకొనేవాళ్ళు. జీతాల గొడవ లేదు. పుస్తకాలు బడివాళ్ళే ఇచ్చేవారు. సుబ్రహ్మణ్యం మాస్టారికి నేనంటే చాలా అభిమానం ఉండేది. సాయంకాలాలు వాళ్ళింటి దగ్గరే చదువుకొనేవాడిని. ఆయన భార్య మాత్రం నన్ను వరండా దాటి లోనికి రానిచ్చేదికాదు.

నా చదువు మా పల్లెలో వాళ్ళకు హాస్యాస్పదంగా ఉండేది. "ఇంగిలీసు సదువు వెలగబెట్టున్నాడు ఎంగిటిగాడు."

"రాములుగానికి వెర్రెత్తింది. పెళ్ళికొచ్చిన కొడుకును కూలికి పెట్టి ఎనుములు మేపినట్టు మేపుతున్నాడు" "మనలాంటోళ్లకు సదువెందుకు? ఈడేమి గవర్నరౌతాడా? కలకటేరా?"

ఎందరు ఏ విధంగా అనుకొన్నా నా చదువు కుంటుపడలేదు. స్కూలు డిబేట్లలో "అస్పృశ్యతా నివారణ" "హరిజనుల సంక్షేమం" "మద్యపాన" నిషేధంవంటి విషయాల గురించి మాట్లాడి ఎన్నో ప్రైజులు తెచ్చుకొన్నాను. అప్పుడప్పుడే నా వారి నీచ స్థితి అర్థంకాసాగింది. మేము పేదలము. అనాగరికులమే కావచ్చు కాని మమ్మల్ని పశువుల కంటె హీనంగా ఎందుకు చూస్తారు? అబ్రహాం లింకను బానిస నిర్మూలన, మహాత్మాగాంధి - హరిజనసేవ మొదలైన పాఠాలు చదివేటప్పుడు నా కళ్ళు చెమర్చేవి. ఇంకెందరు మహానుభావులు పుట్టాలి. మా స్థితి మారటానికి అనుకొనేవాడిని.

స్కూలు ఫైనలు స్కూలుకంతా ఫస్టుగా పాసయినప్పుడు మా నాన్న ఎంతో సంబరపడ్డాడు. ఏదైనా చిన్న ఉద్యోగం

# కబీహాయువా... కైసాహాయువా?

జె. భాగ్యలక్ష్మి



చూపించమని సుబ్రహ్మణ్యం మాస్టారిని కోరారు.

"ఇప్పుడేం ఉద్యోగం రాములూ వాడికి నిండా పదహారేండ్లు లేవు. కాలేజీలో చేరనీ."

"మా లాంటోల్లం భరించే మాటా."

"నీకేం భయం ఉండదు రాములూ. మీ వానికి జీతం లేదు. బొంగూరులో కాలేజి. హరిజనులకు హాస్టలుంది. అక్కడ అన్నీ ఉచితంగా సమకూరుతాయి. నీవు భరించేది ఏముంది చెప్పు."

"ఎంత పెట్టు కంతగాలి. మా లాంటోల్లకు ఇదే గొప్ప."

"అలా అనుకోకూడదు రాములూ. మీ వెంకటేశు చాల తెలివైనవాడు. పైకి రావలసినవాడు, వాని భవిష్యత్తు పాడు చేయకు."

నా కాలేజి చదువు ప్రారంభమయింది. హాస్టల్లో అందరూ నాలాంటి వాళ్ళే గనుక నాకేం ఇబ్బంది అనిపించలేదు. కాలేజీలో కులాల పట్టింపులు అసలే లేవు. ధైర్యంగా కాలేజి కార్యక్రమాలలో పాల్గొనేవాడిని. రెండేండ్లలో స్టూడెంటు యూనియన్‌కు సెక్రటరీనయ్యాను. ఆ రోజుల్లో పుస్తకాలు బాగా చదివేవాడిని. ముఖ్యంగా సంఘ సంస్కర్తల పుస్తకాలు మరీ చదివించేవి. అవన్నీ ఒంటబట్టాయి. కుల మత భేదాలు పోవాలి. సాంఘిక అసమానత తొలగాలి అని నా నేటి రక్తం ఉద్రేకించేది. నేను పెరిగిన వాతావరణం మీది అసహ్యం కొద్దీ మా ఊరి భూస్వాముల మీద కక్ష కొద్దీ మరింత పట్టుదలతో చదివే వాడిని.

బి. ఏ. పూర్తయింది సెకండు క్లాసులో పాసయ్యాను. ఇంగ్లీషులో రెండు మార్కులతో ఫస్టు క్లాసు తప్పిపోయింది. యించుమించు ఈ నాలుగేండ్లు బొంగూరులోనే గడిచిపోయాయి. ఎప్పుడైనా సెలవులకు ఇంటికి వెళ్ళినా ఎక్కువ రోజులు గడిపేవాడిని కాదు. నిజం చెప్పాల్సివస్తే అక్కడ నాకు రోతగా, మనసుకు చిరాగ్గా తోచేది.


నాకు యం. ఏ. చదవాలని ఉన్నా అది కుదరలేదు. మా నాన్న హఠాత్తుగా పోవటంతో మా అమ్మను చూసుకొనే బాధ్యత నామీదే పడింది. నేను చదివిన కాలేజీలోనే ట్యూటరు ఉద్యోగం దొరికింది. నా మకాం పూర్తిగా బస్తీకి మారింది. ఎప్పుడైనా మా ఊరివాళ్ళు వచ్చిపోతుండేవారు. వాళ్ళు వచ్చినప్పుడు మాత్రం నాకు కాస్త చిరాగ్గానే ఉండేది. శుభ్రంగా ఉన్న ఇంట్లో తుపుక్కున ఉమ్మేసేవారు. "రేయ్ ఎంగటేసు" అనేవారు. మురికి ఓడే బట్టలు, కంపుగొట్టే శరీరాలు. స్నానాలు చెయ్యండని చెబితే "మనమేం బాపనోల్లమా పొద్దుకు పదిమాట్లు తానాలాడటానికి" అని తెల్ల దుప్పటి కప్పిన నా మంచం మీద కాళ్ళు చాపజాపి పడుకొనేవారు. అమ్మ మొఖం చూసి మరేమీ మాట్లాడలేకపోయే వాడిని.

రెండేండ్లు ట్యూటరుగా అనుభవం పొందాక యం. ఏ. ప్రైవేటుగా చదవాలనుకొన్నాను. మా ప్రొఫెసర్‌తో ఆ మాట అంటే "యు ఆర్ ఎ వెరీ ఇంటెలిజెంట్ అండ్ బ్రిలియంట్ యంగ్ మాన్. వై డోన్ట్ యు ట్రై ఫర్ ఐ. ఎ. యస్.?"

నేను ఆశ్చర్యపోయాను "నేనేంటి ఐ. ఎ. యస్.కు సెలక్టు కావటమేమిటి?"

"నో నో అలా అనకూడదు. మీరు కష్టపడి చదివారంటే తప్పక సెలక్టు అవుతారు. ఐ నో వాట్ స్టఫ్ యూ ఆర్ మేడ్ ఆఫ్. షెడ్యూల్డు కులాలకు ప్రిఫరెన్సు కూడా ఉంది."

ఆయన ప్రోద్బలంతో ఐ. ఎ. ఎస్. వివరాలు తెలిసికొని పుస్తకాలు అవి కొని శ్రద్ధగా చదువు ప్రారంభించాను. ఒక ఏడాదిపాటు నిర్విరామంగా కృషి చేసిన తర్వాత అడ్వర్టయిజ్మెంటు చూసి అప్లయి చేశాను. పరీక్ష వ్రాయటం, ఇంటర్వ్యూలో




పెలుకావటం అంతా కలగా జరిగి పోయింది.

నా ఆనందానికి అవధులు లేక పోయాయి. మా కాలేజీ వాళ్ళు నన్ను పూలమాలలతో ముంచెత్తి వీడ్కోలు చెప్పారు. ఆ ఊరికే కలెక్టరుగా వచ్చి వారి అభ్యుదయానికి పాటుపడాలని ఊరి పెద్దలన్నారు.

మా అమ్మను మా ఊరికి పంపించా లంటె నాకు మనసొప్పలేదు. ఇన్నేళ్ళలో ఆ ఊరిలో ఏ మార్పు రాలేదని నాకు తెలుసు. కొందరు ముసలాళ్ళు చచ్చి పోయారు. వారి స్థానే వారి పిల్లలు ఊడిగాలు చేస్తున్నారు. వీరి పిల్లలు చీమిడి ముక్కులతో, బానెడు పొట్టలతో, జీబురు తలలతో ఆ మురుగు కాల్వలమధ్య, పెంట కుప్పల మధ్య ఆడుకొంటున్నారు. ఆ వాతావరణంలోకి మా అమ్మను పంపలేక పోయాను. ఆమెను అద్దె ఇంట్లో వదిలి శిక్షణార్థం ముస్సోరి చేరుకొన్నాను.

అది నాకు పునర్జన్మ. ముస్సోరి మంచు కొండల్లో. నవనాగరిక ప్రపంచంలో నాలోని అణువణువు పునర్నిర్మాణం పొందింది. మొట్టమొదటగా ఫోర్క్ నైఫ్ పట్టుకొని చుటూ విస్మయంగా చూపిన రోజు. మొదటిసారిగా ఉలెన్ సూటు వేసుకొన్నరోజు నేను జీవితంలో మరువ లేను. నాలోని "రాములుగాని కొడుకు వెంగటేసు పూర్తిగా చచ్చిపోయాడు. మిస్టర్ వెంకటేశ్ ఐ. ఎ. యస్ వెలిశాడు.

నా పోస్టింగ్ మా జిల్లాకే వచ్చి నప్పుడు చాలా ఆనందించాను. అధికారము, అవకాశం వుండగా ఆశయాలను అమలులో పెట్టవచ్చుననుకొన్నాను. మా ఊరి ప్రజలకు ఎంతో సేవ చేయాలనుకొన్నాను. వారికి ఇండ్లుకట్టించాలని, భూములు పంచిపెట్టాలని వారికి ఒక స్కూలు కట్టించాలని ఇంకెన్నో అనుకొన్నాను.

నల్లగా నిగనిగలాడుతున్న అంబాసడరు మా ఊరి పొలిమేరలు దాటగానే నా ఒళ్ళు పులకరించింది. మా ఊరి రెడ్డిగారు పంచాయతీ పెద్దలు నాకు పూలమాలలు

చాను. రెడ్డిగారి హాలులో మెత్తని కుర్చీలో కూర్చుని చల్లటి పానీయం సేవిస్తూ వారి పథకాల గురించి తెలుసుకొన్నాను.

"మీ ఊరివాళ్ళం. మమ్మల్ని తమరు దయతలచాలి. మీ ఉద్యోగం మాట విన్నప్పటి నుండి మీ దర్శనం చేసుకోవాలని తహతహలాడుతున్నాం. మీ రే దయతలచాలి" రెడ్డిగారు చేతులు నలుపుకొంటూ చెప్పారు. ఆ పగలు వాళ్ళింట్లోనే విశ్రమించాను. సాయంత్రం గాంధీ మైదానంలో బహిరంగ సభలో మాట్లాడి ఊరి పెద్దలందరితో మా పల్లెవైపు కారు నడిపించాను.

"దీనిని ఇకమీదట అంబేద్కర్ నగర్ అని పిలవాలి....'

"అయ్యో. అలాగేనండి"

"ఈ రోడ్లు బాగుచేయించాలి."

"తప్పకుండానండి"

"వీళ్ళకు రెండుగదుల ఇండ్లు కట్టించాలని కూడా అనుకొంటున్నాను."

"దానికే ముందండి. మన కంట్రాక్టరు సత్యమూర్తి రెండుమూడు నెలల్లో దీన్ని మహానగరం చెయ్యడటండీ".

కారు గుడిసెల ముందు ఆగింది. అందరూ చోద్యంగా ఇండ్లముందు నిలుచున్నారు. వాళ్ళలో, ఆ పరిసరాలలో ఏమాత్రం మార్పులేదు. నేను నిల్చోటానికైనా సరయిన స్థలం కన్పించలేదు.

"ఏందిరా గుంపు" ఒక ముసలాయన వణుక్కుంటూ వచ్చాడు.

"ఈరయ్యా మామా నీ అన్న కొడుకు కొచ్చిండు".

"ఏందేందీ?"

"రాములు గాని కొడుకు."

"ఎంగటేసా? రేయ్ ఎంగటేసూ ఎంతోని వయ్యావురా" అతను ఏదేదో గొణుగుతూ నన్ను కౌగలించుకొంటున్నాడు. ముక్కు బద్దలయ్యే కంపు. ఒంటి పై వేలాడుతున్న పీలికలు... చుట్టూ ప్రెస్సు కెమెరాలు క్లిక్ క్లిక్ మంటున్నాయి. రెడ్డిగారు ఊరి పెద్దలు కాస్త దూరంగా జరిగి నిల్చున్నారు. వాళ్ళ ముఖాల్లో అదేమిటి అవహేళనా? తక్కున వెనక్కి తిరిగి వడివడిగా నా కారు చేరుకొన్నాను. కారును బంగళాకు పోనివ్వమని చెప్పాను.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. కుమిలి కుమిలి ఏడ్చాను. దుఃఖం పొర్లుకు వస్తోంది. నా బాధ నాకే అర్థం కాలేదు. ఒక నెల సెలవు పెట్టి ఎక్కడైనా దూరంగా హాయిగా గడిపి రావాలనుకొన్నాను. అప్పుడే బదిలీకి ప్రయత్నించాలని కూడా గట్టిగా నిర్ణయించుకొన్నాను. ★

